www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు 2024
5
అన్నమయ్య



నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఎకార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

తొలగింపులపై నేడు స్కీమ్ వర్కర్ల నిరసనలు

◆ **కడప, అన్నమయ్య జిల్లాల్లో కార్మికుల శంఖారావం**

తొలగింపు, బెదిరింపులకు నిరసనగా స్కీమ్‌వర్కర్ల ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. సోమవారం కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కదం తొక్కనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్న తమను తొలగిస్తామనే పేరుతో వేధింపులకు గురి చేయడాన్ని గర్హిస్తూ ఉక్కు పిడికిలి బిగించనున్నారు. రాష్ట్రంలో అధికారం మారినప్పడల్లా ఆందోళనకు చేరిచేయడం ఫ్యాషన్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందులోభాగంగా కడప, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా పలువురు అంగన్వాడీలు, విఒఎలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తొలగింపు, బెదిరింపులపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. బెదిరింపులకు కొనసాగింపుగా శనివారం సంబేపల్లి మండలం పెద్ద జంగంపల్లికి చెందిన అంగన్వాడీ ఆత్మహత్యాయత్నం చేయడం ఆం దోళన కలిగిస్తోంది.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లోని స్కీమ్‌వర్కర్ల తొలగింపు, బెదిరింపు ప్రయత్నాలకు ప్రతిఘటన ఎదురవుతోంది. ఇందుకు సిఐటియు నాయకత్వం వహిస్తోంది. ఇందులోభాగంగా కడప, అన్నమయ్య జిల్లాల కలె క్టరేట్‌ల ఎదుట పెద్దఎత్తున ఆందోళనలకు కసరత్తు చేసింది. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌ల ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేయనున్నారు. కడప జిల్లాలో అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, యానిమేటర్లు విఒఎలు, ఆప్కాస్ కింద కాంట్రాక్టు కార్మికులు సుమారు 10 వేల మంది ఉన్నారు. అన్నమయ్య జిల్లాలో సుమారు 12 వేల మంది స్కీమ్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో అధికార పార్టీ పలువురు స్కీమ్ వర్కర్లను తొలగిస్తామనే పేరుతో బెదిరింపులకు పాల్పడుతోంది. ఇందులోభాగంగానే అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం పెద్దజంగంపల్లికి చెందిన జె.నాగరత్నమ్మ అనే అంగన్వాడీ వేధింపులకు తాళలేక శనివారం ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. చిన్నమండెం మండలానికి చెందిన మరో ఇద్దరు అంగన్వాడీలను బెదిరింపులకు గురి చేయడం ఆందోళన కలిగిస్తోంది. వీరితోపాటు కలకడ మండలంలోని రాతిగుంటపల్లికి చెందిన సంఘ మిత్ర విజయకుమారి, దేవరపల్లికి చెందిన రెడ్డిలక్ష్మిలను తొలగిస్తామని పేరుతో బెదిరింపులకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. మూడేళ్ల కాలపరిమితి పూర్తి చేసిన సంఘ మిత్రలను తొలగించాలని ఒత్తిళ్లకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలోని ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొండాపురం సెక్టార్‌లో ఐదుగురు అంగన్వాడీలను రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడం, జమ్మలమడుగులో మధ్యాహ్న భోజన కార్మికులను బలవంతంగా రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. వీరితోపాటు జిల్లాలోని వేంపల్లి, కమలాపురం, సింహాద్రిపురం మండలాలకు చెందిన పలువురు అంగన్వాడీల తొలగింపు ప్రయత్నాలు చేయడం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి బెదిరింపు, తొలగింపు ప్రయత్నాలకు నిరసనగా సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్య క్రమాలను తీసుకుని స్కీమ్‌వర్కర్ల పక్షాన నిలిచి గళమెత్తుతుండడం గమనార్హం.



సంబేపల్లెలో రాజకీయ వేధింపులు తాళలేక ఆత్మహత్యకు యత్నించిన నాగరత్నమ్మ

నీటిని వృథా చేయకండి :'మండిపల్లి'

- వెలిగల్లు కుడికాలువకు నీటిని విడుదల చేసిన మంత్రి

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కుడికాలువ ద్వారా వస్తున్న నీటిని రైతులు వృథా చేయకుండా వాటిని తగినంతగా ఉపయోగించుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెలిగల్లు కుడి కాలవ హెడ్ రెగ్యులేటర్ వద్ద కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర టిఎంసి నీటిని మండల పరిధిలోని 20 కిలోమీటర్ల వరకు కాలువ ద్వారా నీరు అందుతాయని, వీటిని రైతులు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిఇ శిరీష్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సాంబశివ, రామ్మోహన్ నాయుడు, భద్రప్ప నాయుడు, వెంకట రమణ, కుడుముల రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కుడికాలువకు నీటిని విడుదల చేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సుస్మిత

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో మత్స్య కారులందరికీ అందుబాటులో ఉంటూ వారికి జీవన ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్. సుస్మిత పేర్కొన్నారు. జిల్లాలో మత్స్యశాఖకు, కార్మికులకు, వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సీడీలు, ఇంతర పథకాల, ఉపాధి జీవనాధారం ఎలో కల్పించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖి లో ఆమె వివరించారు.



అన్నమయ్య జిల్లాలో మత్స్యశాఖ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా మత్స్యశాఖ కార్యాలయాలు బహుదా, పీలేరులలో, సహాయ మత్స్యశాఖ కార్యాలయం రాజంపేట, మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయంలో మదనపల్లిలో ఉన్నాయి. గాలివీడు, గుర్రంకొండ, నిమ్మనపల్లె, పెద్దమండెం, వాల్మీకిపురం, చిన్నమండెం, బి. కొత్తకోట, కురబలకోట, మదనపల్లె, ములక చెరువు, పెద్ద తిప్పి సముద్రం, రామసముద్రం, తంబళ్లపల్లె, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, కలకడ, కంభంవారిపల్లె, పీలేరు. ముండుపల్లె, సంబేపల్లి, చిట్వేలు, నందలూరు, ఓబులవారిపల్లె పుల్లంపేట, పెనగలూరు, రైల్వే కోడూరు, రాజంపేట, వీరబల్లిలో ప్రాంతాలలో సబ్ డివిజన్ కార్యాలయాలున్నాయి.

మత్స్యశాఖ అధికారుల విధి విధానాలు తెలపండి?

మత్స్య శాఖలో చేప పిల్లలు పెంపకం, చెరువులు లీజుకు ఇవ్వడం, లైసెన్స్ రిజర్వాయర్లలో మత్స్య కారులకు లైసెన్సుల మంజూరు చేయించడం, ప్రభుత్వ పథకాలాన్నిటిని మత్స్య కారులకు అందజేయడం మత్స్యశాఖ అధికారుల విధి విధానం.

జిల్లాలో లైసెన్స్ రిజర్వాయర్లు,చెరువుల వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా 2 లైసెన్స్ జర్వాయర్లు, 149 చెరువులున్నాయి. చేపల చెరువులకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి.

మత్స్య శాఖకు ఆదాయాన్ని ఏవిధంగా పెంచుతున్నారు?

మత్స్యశాఖ ద్వారా రెండు రకాలు ఆదాయ పెంపుదలకు కృషి చేస్తున్నాం. ప్రధానమంత్రి మత్స్య సంపద యువజన పథకం (పిఎంఎంఎస్) ద్వారా శాఖా పరంగా గుర్తించిన చెరువులలో సీడ్ చేసి, లైసెన్స్ రిజర్వాయర్లలోలో చేప పిల్లలను వదలడం ద్వారా చేపల వృద్ధి చెందడానికి చర్యలు చేపడుతున్నాం. మత్స్యశాఖ శాఖలో లైసెన్స్ రిజర్వాయర్‌లో చేప పిల్లలను పెంచడం, నూతనంగా వచ్చే పథకాలను మత్స్య శాఖ కార్మికులకు వివరించడం జరుగుతూ ఉంటుంది.

ఫిష్ దుకాణాలు ఎన్ని ఉన్నాయి ?

జిల్లా వ్యాప్తంగా 31 పిష్ దుకాణాలున్నాయి. అందులో 15 ద్విచక్ర వాహనాలు, త్రీ వీలర్ వాహనాలు 1, నాలుగు చక్ర వాహనాల 2 ఉన్నాయి.

మత్స్య శాఖ ద్వారా ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తున్నారు?

చెరువులలో చేపల పెంపకం, రవాణా ద్వారా డ్రైవర్లకు, కూలీలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వీటితో పాటు మత్స్య కారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అమలు చేయడానికి కృషి చేస్తున్నాం.

మత్స్యశాఖ లకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి ?

మత్స్యశాఖ కార్మికులందరూ డిపార్ట్‌మెంట్ కల్పించిన స్కీములను ప్రత్యేకంగా ఉపయోగించుకోవాలి. ప్రతి మూడు నెలలకు, 6 నెలలకు ఒకసారి మేనేజింగ్ కమిటీ సంఘల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలి. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలన్నింటినీ కార్మికులు ఉపయోగించుకోవాలి.

ప్రజా రవాణా వ్యవస్థలో మెరుగైన సేవలే లక్ష్యం

రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో పాటు వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలనే సదుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అద్దె (హైర్) బస్సుల సేవలను వినియోగిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప ఆర్‌టిసి నూతన గ్యారేజీ ప్రాంగణంలో కడప రీజన్‌లోని వివిధ డిపోలకు చెందిన 18 నూతన బస్సులను జెండా ఊపి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారవాణా వ్యవస్థలో ప్రజలకు అత్యంత భద్రత, సులభతర సుఖమయ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం విస్తృతంగా అద్దె (హైర్) బస్సుల సర్వీసులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వ పరిధిలో ప్రజా సేవలను అందిస్తున్న హైర్ బస్సుల ఓనర్లందరికీ శుభాభినందనలు తెలుపుకుం టున్నా మన్నారు. ఐదేళ్లలో ఎపిఎస్ ఆర్టఇసి పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. రాబోయే కాలంలో ఎపిఎస్‌ఆర్‌టిసిని ప్రక్షాళన చేసి, ప్రయాణికులకు నాణ్యమైన సేవల అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర రవాణా వ్యవస్థ ద్వారా మరిన్ని నూతన ఆర్‌టిసి బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కూడా అతి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో అద్దె బస్సులకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, ప్రభుత్వం ఏర్పడ్డ రెండు నెలల్లోనే సుమారు 1400 నూతన బస్సులు ఎపిఎస్ ఆర్‌టిసి పరిధిలోకి వచ్చాయని, ఇప్పటికే 400 బస్సులు సర్వీసులు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం కడప డిపో నుంచి 18 నూతన బస్సు సర్వీసులు వివిధ ప్రాంతాలకు ప్రజారవాణా సర్వీసులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇందులో రెండు ఇంద్ర, ఒక సూపర్ లగ్జరీ, మిగతా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్, బస్సులు ఉన్నాయన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మన జీవనంలో ఆర్‌టిసి బస్సు ఒక భాగమని, గ్రామాలకు కూడా బస్సులు వెళుతుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ముఖ్యంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అతి త్వరలోనే మహిళామూర్తులకు ఒక శుభవార్త చెబుతామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గ నాయకులు విజయమ్మ, భూపేశ్ రెడ్డి, ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ లక్ష్మీ భాస్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ, జిల్లాలోని 6 డిపోల డిపో మేనేజర్లు, అద్దె బస్సుల యజమానులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన బస్సులను జండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవి

అంగన్వాడీ వర్కర్‌పై వేధింపులు తగవు : ఐద్వా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్ పైన రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు తగవని అఖిల ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ భాగమ్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా, సంబేపల్లి మండలం, దుద్యాల గ్రామం, పెద్ద జంగంపల్లిలో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న జె. నాగరత్నను రాజకీయనాయకులు, సిడిపిఒ, సూపర్‌వైజర్లు కలగలుపుకుని వేధింపులకు గురి చేయడం బాధాకరమన్నారు. అంతటితో ఆగకుండా విధుల నుంచి తప్పిస్తామని భయాందోళనలకు గురి చేయడం దారుణమన్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నాగరత్న ఆత్మ హత్యా యత్నానికి పాల్పడిందని, జరగరానిది జరగుంటే ఆమె కుటుంబానికి దిక్కెవరని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు చిరుద్యోగులైన అంగన్ వాడీ, వర్కర్లు, అయా, ఆశా కార్యకర్తలపై వేధింపులు మానుకోవాలన్నారు. నాగరత్నకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని జిల్లా రాయచోటి జిల్లా కేంద్రంలో అవసరమైతే నిరసనలు, ధర్నాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని రాజకీయ నాయకులు, అధికారులను హెచ్చరించారు. సమావేశంలో షాహినా, ఎస్ రెడ్డి ప్రసన్న, సి. ఉషారాణి, గాయత్రి పాల్గొన్నారు.




సర్టిఫికెట్లతో కరాటే విద్యార్థులు

యూత్ కరాటే క్లబ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

ఒకినోవా గోజురియో కరాటే డూ ఫెడరేషన్ మలేషియా బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో యూత్ కరాటే క్లబ్ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.ఆర్.సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజ పరిస్థితులలో విద్యార్థులు తప్పనిసరిగా కరాటే విద్యను నేర్చుకోవాలని సూచించారు. కరాటే ద్వారా మహిళలకు అత్యవసర పరిస్థితులలో ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించినందుకు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు, ఆటపాటల్లో కూడా రాణించాలని, దీంతో పాటు కరాటే విద్య ఎంతో అవసరమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసు నుంచే కరాటే శిక్షణ ఇప్పించడం ద్వారా పిల్లలకు ఆరోగ్యం, ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యం, ఆత్మ విశ్వాసం, శారీరక ధృఢత్వం ముఖ్యంగా ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. తద్వారా విద్యార్థులు విద్యలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని వివరించారు. కార్యక్రమంలో కరాటే బ్లాక్ బెల్స్ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సంస్థ ప్రతినిధులు

భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిందే మానవ హక్కు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

భారత రాజ్యాంగం ద్వారా ప్రతిఒక్కరికీ మానవహక్కు లభించిందని లోకసమస్త హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ జి.పి.నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హాలులో ఆ సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి.పి.నరసింహులు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. సమాజంలో ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. అనంతరం సంస్థ విధి విధానాలను సభ్యులకు వివరించి, సభ్యులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా ఎవరి వంతు వారు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో లోకాసమస్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.వీరయ్య యాదవ్, జనరల్ సెక్రెటరీ పి.శంకర్, కోఆర్డినేటర్ రఘురాములు, మహిళా విభాగ వైస్ చైర్మన్ ఎ.లక్ష్మి భవాని, జిల్లా లీగల్ అడ్వైజర్స్ అడ్వకేట్ యం.చెన్న కృష్ణ, ఎ.రెడ్డి సాయి గీత, దీపా, రాయలసీమ జిల్లాల చైర్మన్ కుమార్, జిల్లా మండల స్థాయి సభ్యులు కె.మధు, ఎం.శ్రీను వాసులు, డి.నారాయణ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అని ఓ సినీ కవి చెప్పినట్లు ఈ ప్రపంచంలో స్నేహితులు లేనివారంటూ ఉండరని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ పేర్కొన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విజయనగర్ కాలనీలోని సమ్మర్ క్యాంపు పిల్లలతో ఐద్వా ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు అయినవారు దూరం జరిగినా తామున్నామంటూ స్నేహితులు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందించి ఆదుకుంటారని తెలిపారు. మంచి స్నేహితుల మధ్య ఎలాంటి కల్మషాలు ఉండవని, ప్రతీ విషయాన్ని పంచుకుంటారని వివరించారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకుని, స్వీట్స్ ఒకరికొకరు తినిపించుకుని స్నేహితుల దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి ప్రసన్న, భాను, గాయత్రి, రేవతి పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం

సుప్రీం తీర్పు ఎంఆర్‌పిఎస్ విజయం



కేక్ కట్ చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎంఆర్‌పిఎస్ నాయకుల విజయమని ఎమ్మార్పీఎస్ న్యాయ సలహాదారు సురేష్ రాజు తెలిపారు. మండల పరిధిలోని డిబిఎన్ పల్లె గ్రామంలో ఆదివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. గ్రామ పెద్దలు నాయకులకు పుష్ప గుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వెలగచర్ల శివయ్య, న్యాయ సలహాదారు లాయర్ సురేష్ రాజు, టి.హరిప్రసాద్, రాష్ట్ర నాయకులు చేమూరి వెంకటేష్, జిల్లా నాయకులు మందా శివయ్య, మందా రవి, ఎంఇఎఫ్ రాష్ట్ర నాయకులు మదనపల్లి పెంచలయ్య వడ్డెర, ఎంఇఎఫ్ నాయకులు బి.చంద్రశేఖర్, జె.జయకుమార్ హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న మాదిగ సామాజిక వర్గాన్ని ఉద్ధరించేందుకు మంద కృష్ణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి కేవలం మాదిగలకే కాక అనేక పోరాటాలతో విభిన్న ప్రతిభావంతుల సామాజిక పింఛన్, ఆరోగ్యశ్రీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు సాధించి పెట్టారని తెలిపారు. అయినప్పటికీ మాది గలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకపడే ఉన్నారని చెప్పారు. తమ ముప్పై ఏళ్ల సుదీర్ఘ ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, ఇకపై అటువంటి ఆటుపోట్లు ఎదురవ్వకపోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యతోనే అజ్ఞానాన్ని తొలగించుకుని ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చని ఆనాడు బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారని, ఆయన అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణ, బాల నరసయ్య, హరికృష్ణ, సుబ్బరాయుడు, నరసింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

7 నుంచి స్కౌట్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి : ఈనెల 15న జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల మార్చ్ ఫాస్ట్ కోసం ముందస్తుగా నిర్వహించే శిక్షణలో పాల్గొనే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల వివరాలను సంబంధిత పాఠశాలల స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్ వెంటనే తెలపాలని జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి కోరారు. స్కౌట్స్ , గైడ్స్ యూనిట్ లను నిర్వహిస్తున్న పాఠశాలలలో 8 లేదా 9వ తరగతి చదువుతున్న ఇద్దరు స్కౌట్ విద్యార్థులు, ఇద్దరు గైడ్ విద్యార్థినిలను మార్చ్ పాస్ట్ శిక్షణ కోసం ఎంపిక చేయాలన్నారు. వీరి ఎత్తు 4.8 నుంచి 5.3 అడుగులు మధ్య ఉండాలన్నారు. వీరికి ఉచిత వసతి, భోజనం కల్పించి ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు రాయచోటిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మార్చ్ ఫాస్ట్ శిక్షణ కోసం ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలను సోమవారం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రెటరీ కి పంపించాలని సూచించారు.



మోటార్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రంగంపల్లి దళితవాడ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమైందని ఆనందం వ్యక్తం చేశారు.సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ముక్కా వరలక్ష్మి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన బోరు వేయించి నీటి సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వారు ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం బోరు వేపించి తాగునీటి సమస్యను పరిష్కరించారని హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నూతన బోరును ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గ్రామంలో అయినా నీటి సమస్య, విద్యుత్ సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే పరిష్కరించడానికి ముందుంటామని పేర్కొన్నారు. నేటి మోటార్ వద్ద చెత్తాచెదారం వేయకుండా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.కార్యక్రమంలో జికె వెంకటసుబ్బారెడ్డి, సింగమాల మల్లికార్జునరెడ్డి, రెడ్డయ్యరెడ్డి, కంచర నరసింహారెడ్డి, ఆదినారాయణరెడ్డి, లేపాకు మస్తానయ్య, పోలేపల్లి నరసింహులు, ప్రసాద్, హేమంత్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి-వీరబల్లి

ఎస్‌సి వర్గీకరణకు అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమైందని ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు నరసింహులు, పెద్దవీటి రామ్మోహన్, సర్పంచ్ సిద్దవటం నాగులమ్మ తనయుడు రవి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని డి. రాచపల్లి పంచాయతీ పెద్దమా దిగపల్లెలో అంబేద్కర్ చిత్రపటానికి, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి ఎస్‌సి వర్గీకరణ కోసం మహా జననేత మంద కృష్ణ మాదిగ న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారని అన్నారు.అంబేద్కర్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అక్కడ వచ్చిన వారందరికీ చాక్లెట్లు, కేకులు పంచి పెట్టుకుని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చింతాతి రామయ్య, ఎంపిటిసి నాగులయ్య, ఎర్రగాళ్ల వెంకటరమణ, పెద్దివీటి రామ్మోహన్, చెన్నూరి పవన్ కుమార్, మాజీ డీలర్ మల్లికార్జున, రామ్మోహన్, కదరయ్య, బాబు, ఆంజనేయులు, శ్రీధర్, హలీబాబు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి జయంతి

ప్రజాశక్తి-మదనపల్లి

పట్టణంలోని నీరుగట్టువారి పల్లిలో వెలసిన తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం శ్రీచౌడేశ్వరీ దేవి జయంతి వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, సెక్రటరీ బండి పవన్ కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్యల ఆధ్వర్యంలో ఈ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొగటవీర క్షత్రియ సోదరులు ప్రతి ఏడాది ఎంతో ఘనంగా అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది జయంతి ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించారని అభినందించారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం గౌరవాధ్యక్షులు మోడెం వెంకటరమణ, ఉపాధ్యక్షులు ఆర్.చంద్రశేఖర్,ఆర్.నీలకంఠ,మోడెం సిద్దప్ప, బండి నాగరాజ, జి.లక్ష్మీనారాయణ, ఉప్పు రామచంద్ర, కె.వి.నాగరాజు, శ్రీరామ్ చినబాబు, చౌడేశ్వరి దేవి యువజన సేవా సంఘం అధ్యక్షులు ఉప్పు శ్రీనివాసులు, కార్యదర్శి రామిశెట్టి జగదీష్, కోశాధికారి బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.**తంబళ్లపల్లి :** మండలంలోని పరుసతోపు పంచాయతీ బురుజులో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి మహోత్సవాలను ఆదివారం గ్రామస్తులు తోగట వీర క్షత్రియులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయాన్నే అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని కాయ కర్పూరాలు ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



నాగమణి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

మాజీ సర్పంచ్ కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పకీరరెడ్డిగారిపల్లె మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నారాయణరెడ్డి సతీమణి కొండ్రెడ్డి నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరై నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లుళ్ల కొండ్రెడ్డి రాజారెడ్డి , సిద్ధారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, హేమకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్ రియాజ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్లంజ్ పూల్‌ను తక్షణం పూడ్చాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శ్రీశైలం డ్యాం కింద ఏర్పడిన ప్లంజ్‌పూల్‌ను తక్షణం పూడ్చేయాలని, అలా కానీ పక్షంలో శ్రీశైలం డ్యాం కూలిపోయే ప్రమాదం ఉందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాక ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం, రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఈ భారీ గొయ్యిని పూడ్చి రాయలసీమ రైతులకు ఏర్పడ్డ ప్రమాదాన్ని తొలగించాలని ఆయన సూచించారు. 2009లో భారీ వరదల కారణంగా 25,00,000 క్యూసెక్కుల వరదలు శ్రీశైలం డ్యాం గేట్లపై నుంచి ప్రవహించిందని, దీనివల్ల 45 మీటర్ల లోతులో, 400 మీటర్ల పొడవు, 270 మీటర్ల వెడల్పుతో భారీ గొయ్యి ఏర్పడిందన్నారు. దీంతో భవిష్యత్తులో భారీ ప్రమాదం పొంచి ఉందన్నారు. నాగార్జున సాగర్ కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే రాయలసీమలో శ్రీశైలం డ్యాం నీళ్లను నమ్ముకొని నారుమళ్లు పోశారని, రాయలసీమ రైతులను కాపాడాలని ప్రతాప్‌రెడ్డి కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత: 'మండిపల్లి'

ప్రజాశక్తి-రామాపురం

నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య పరిష్కారానికి తన మొదటి ప్రాధాన్యత ఉంటుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ లోని కొత్తపల్లి బిసి కాలనీ, పాతపల్లె గ్రామాలలో ఆదివారం తాగునీటి కోసం బోర్లు వేసి కుళాయిలు బిగించి నీటిని ప్రజలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ మంతా మెట్ట ప్రాంతమని, ఈ ప్రాంతంలో తాగునీరు, సాగునీరుకి బోర్లు ఆధారమని అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం తాను మొదటి ప్రాధాన్యతగా పెట్టుకున్నట్లు తెలిపారు. చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన మొదటి ఏడాదిలో వర్షాలు బాగా పడి అన్ని ప్రాంతాలలో జలాశయాలు నిండి రైతులకు ప్రజలకు నీటి సమస్య లేకుండా ప్రకృతి సైతం సహరిస్తుందన్నారు. కొత్తపల్లి బిసి కాలనీ గ్రామాలలో తాగునీటి సమస్య తమ దృష్టికి రావడంతో రెండు బోర్లు వేసి పైపులు వేసి ప్రజలకు నీరు అందించామని తెలిపారు. వెలుగల్లు కాలువ ద్వారా సాగునీటికి విడుదల చేసినట్లు పేర్కొన్నారు. తాగునీటి యెద్దడి తీర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం టిడిపిఉపాధ్యక్షుడు గడికోట విజయ భాస్కర్ రెడ్డి, అయోధ్యపురం పట్టాభిరెడ్డి, శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎంపిడిఒ



చెత్త డబ్బాలు అందిస్తున్న ఎంపిడిఒ, సర్పంచ్

ప్రజాశక్తి-వీరబల్లి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మట్లి పంచాయతీ సర్పంచ్ నాగార్జునఆచారి, ఎంపిడిఒ రామచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తడి చెత్త, పొడి చెత్త, బుట్టలో వేయవలెను అన్నారు. ఇంటి పరిసరాల్లో, రోడ్డుపైన, మురికి కాల వల్లో చెత్త వెయ్యవద్దని సూచించారు. గ్రామ సేవకుల వచ్చి చెత్తను తీసుకుని సంపద సృష్టించే కేంద్రానికి తీసుకపోతారని చెప్పారు.అక్క వర్మికంపోస్ట్‌తో సేంద్రియ ఎరువు తయార ుచేస్తారని అన్నారు. ప్రజలంతా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మోడం లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ నాగముని, ఎంకె.జయచంద్ర, జగదీష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఆయన మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పరిరక్షిస్తే ప్రకృతే మనందరిని రక్షిస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యంగా పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా ఉండాలంటే మొక్కలను విరివిగా పెంచాలని తెలిపారు. మొక్కలను వృక్షాలుగా పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో నిమ్మనపల్లి ఎస్ఐ లోకేష్ రెడ్డి, స్థానిక డిఎస్‌పి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు

దేశ నిర్మాణం, అభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉమాదేవి

ప్రజాశక్తి-పీలేరు

దేశ నిర్మాణం, అభివృద్ధిలో యువతదే కీలక పాత్ర అని టిసిఎస్ సంస్థ అధికార ప్రతినిధి శ్రీనివాసులు, శ్రీ భువన విద్యాలయం అధినేత్రి ఉమారమాదేవి తెలిపారు. టిసిఎస్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం పీలేరు శ్రీభువన విద్యాలయంలో దేశ నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు విద్య, వైద్య, విజ్ఞాన, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించడం సృజనాత్మక దృక్పథం ఉన్న యువతకే సాధ్యమని అన్నారు. నేడు ప్రపంచం ముందు పేదరికం, నిరుద్యోగం, గ్లోబల్ వార్మింగ్ వంటి అనేక ప్రధాన సమస్యలున్నాయని, వీటన్నింటి పరిష్కారం రాబోయే తరం చేతుల్లోనే ఉండాలన్నదే తమ ఉద్దేశమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ గుణలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు దోహదపడే విద్య, నైపుణ్యాలను అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నామని చెప్పారు. ఈ వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన 6,7,8,9,10వ తరగతి విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణకుమారి, సుహాసిని, నారాయణ పాల్గొన్నారు.

ఐక్యంగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం

-మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, పాలకులు, అధికారులు ఐక్యంగా ఉండి మండల అభివృద్ధికి పాటుపడదామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గాలివీడు మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపిపి జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో హౌసింగ్‌లో పొరపాటు జరిగి ఉంటే వాటిని సరి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులందరూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. మండల కేంద్రంలో మోడల్ స్కూల్ లేకుండా పోవడానికి కారణాలు ఏమిటి అది విచారించి తమకు నివేదిక ఇవ్వాలని అని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందేలా చూడాలని, అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండి పర్యవేక్షించాలని అన్నారు. ఈనెల 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకవస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి-1మిట్టపల్లి యదుభూషణరెడ్డి, వైస్‌ఎంపిపి-2 గాలి శ్రీనివాసులు, ఎంపిటిసిలు చంద్రారెడ్డి, సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి, మల్లికార్జున్ నాయుడు, రవికుమార్ నాయుడు, పార్థసారథి రెడ్డి ఎంపిడిఒ శ్రీనివాసులు, డిటి తిమ్మారెడ్డి, ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పునర్విభజన హక్కులు నెరవేర్చాల్సిందే

ప్రజాశక్తి - కడప అర్బన్

పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన హక్కులన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాల్సిందే అని, లేకుంటే ప్రజా ఉద్యమం మొదలవుతుందని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ హెచ్చరించారు. ఆదివారం నగరంలోని ఐఎంఎ హాలులో రాష్ట్ర కన్వెన్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల హక్కు అయినా ప్రత్యేక హోదా అంశాన్ని కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించిందని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్యాకేజీ తో పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు సభలలో ప్రత్యేక హోదా కోసం ఏ ఒక్క నాయకుడు గొంతెత్తకపోవడం సిగ్గుచేటని తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.సుం దరామరాజు, రాష్ట్ర కార్యదర్శులు జయవర్ధన్, సుబ్బమ్మ డి. వి. యన్ రాజు, జె.వి. నరసింహ మూర్తి, చక్రవర్తి,బి. వేణు పాల్గొన్నారు.

సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్/సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని కోరారు. ఆదివారం కడప ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలో భాగాంగా 7,329 మంది ఎనర్జీ అసిస్టెంట్/సెక్రటరీలు నియమించబడ్డారని తెలిపారు. ఇందులో పనిచేసే 18 కేటగిరి చెందిన ఉద్యోగులు వారికి కేటాయించిన సచివాలయ పరిధిలోని విధులను మాత్రమే నిర్వర్తించేవారని చెప్పారు. కానీ ఎనర్జీ సెక్రటరీ గ్రేడ్2లు మాత్రం గ్రామ సచివాలయం దాటి సుమారు 15 కిలోమీటర్ల పైబడి సీనియర్ విద్యుత్ ఉద్యోగులు చేసే పనిని సైతం చేస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలు రకాల విద్యుత్ ప్రమాదాలతో 100మందికి పైబడి చనిపోగా, మరో 200 మంది శరీర భాగాలు కాలిపోవడం, అంగవైకల్యం సంభవించాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వాడ సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృపాకర్, కార్య వర్గ సభ్యులు ప్రకాష్ రావు, శివ, కులయప్ప పాల్గొన్నారు.

టీచర్ల పని సర్దుబాటును నిలిపివేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : జీవో 117 ఆధారంగా టీచర్లను పని సర్దుబాటు చేయడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వెంటనే నిలిపి వేసి నెలవారి ఉద్యోగోన్నతులను చేపట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎపిటిఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వవిద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించే జిఒ నంబర్ 117 ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చెప్పిన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ అదే జిఒ ఆధారంగా టీచర్ల పనిసర్దుబాటు చేయటం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. పది మంది లోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని విద్యాశాఖాధికారులు వెబెక్స్ సమా వేశంలో చెపుతున్నారని, పాఠశాలలను మూసివేయడం వల్ల పేద బలహీన వర్గాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమవుతారన్నారు. సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు క్రిష్ణారెడ్డి, గురయ్య, భాస్కరరెడ్డి ,జిల్లా కార్యదర్శులు రామ్ భూపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు బాలజ్యోజి, అబ్దుల్ సత్తార్, జిల్లాకౌన్సిలర్లు అన్వర్ బాషా, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈ నెల 7,8 తేదీల్లో జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆదివారం మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి చేతుల మీదుగా కరపత్రాల విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలోనూ, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలోనూ ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభినయ్ పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ప్రసాద్‌యాదవ్

205 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలో నలంద విద్యానికేతన్‌లో 205 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో వైద్య పరీక్షలు నిర్వహించామని మానవత సేవా సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ నూకల రవీంద్ర పర్యవేక్షణలో 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. 49 మందికి ఆపరేషన్ కొరకు 6న తిరుపతికి ఉచితంగా తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి లక్కిరెడ్డిపల్లిలో విడిచిపెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ చైర్మన్ ఎస్ బాలసుబ్రమణ్యం, కోచైర్మన్ శివశంకర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.శివారెడ్డి జోన్ చైర్మన్ మహమ్మద్ మండల అధ్యక్షులు రమణారావు, కోశాధికారి రవిశంకర్, జిల్లా సభ్యులు రామాంజనేయులు, ఎం.రమణ, వీరనాగిరెడ్డి, డాక్టర్ షఫీ నాయక్ ఫకీరయ్య లయన్స్ క్లబ్ సభ్యులు పవన్‌కుమార్‌నాయుడు, రామ్మోహన్, వెంకటరామిరెడ్డి, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

బలిజసేన కార్యదర్శిగా జయచంద్ర

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు నియోజకవర్గ బలిజసేన కార్యదర్శిగా పసుపులేటి జయచంద్ర నియమి తుల య్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవికి సహరించిన వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్కాట్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి అనంతరాయలు, కోడూరు నియోజకవర్గ అధ్యక్షులు సుంకర రవిలకు ప్రత్యేకత కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవికి శక్తి వంచన లేకుండా అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని అన్నారు.

పట్టణ ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ వెల్లడించారు. పట్టణంలోని గర్ల్స్ స్కూల్ వీధిలో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పట్టణంలో ప్రతి రోజు ఫాగింగ్ మిషన్ ద్వారా ఫాగింగ్ చేయించడం జరుగుతోందన్నారు. ఈ బాధ్యతలను నగర పంచాయతీ శానిటేషన్ అధికారి కిరణ్ కుమార్, ఎఇ రాజేందర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

నేడు సబ్ కలెక్టరేట్ ఎదుట మాలమహానాడు ధర్నా

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేద్దామని రాయలసీమ మాల విద్యార్థి సంఘం అధ్యక్షులు మాలతోటి నరేష్ ఆదివారం పిలుపునిచ్చారు. మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శన్ ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మాల సామాజిక వర్గీయులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మాల విద్యార్థి నాయకులు మద్దెల వినోద్ , దుబ్బ శివ, హేమంత్ కుమార్, రూపేష్, చంద్ర మోహన్ పాల్గొన్నారు

హాకీ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన అఖిల్ వెంకట్, బాలాజీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హాకీ ఇండియా ఆధ్వర్యంలో జులై 10 నుంచి 17 వరకు కడప జిల్లా పులివెందులలో నిర్వహించిన సెకెండ్ సౌత్ జోన్ జూనియర్ మెన్ టోర్నమెంటులో ఆంధ్ర ప్రదేశ్ జట్టుకి ప్రాతినిధ్యం వహించిన ఎన్. అఖిల్ వెంకట్ ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, శివ ప్రసాద్ తెలిపారు. ఈనెల 13వ నుంచి 27వ వరకు బెంగళూరులో జరగబోయే సౌత్‌జోన్ జూనియర్ మెన్ క్యాంపుకి అఖిల్ వెంకట్ ఎంపికైనట్లు ఆదివారం వారు ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 19 నుంచి 26 వరకు కేరళ రాష్ట్రం కొల్లాంలో సెకెండ్ సౌత్ జోన్ సబ్ జూనియర్ మెన్ టోర్నమెంట్ నిర్వహించగా ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున వి.బాలాజీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు సెలక్షన్ కమిటీ తెలిపారు. పులివెందులలో ఈనెల 13 నుంచి 26 వరకు నిర్వహించబోయే సబ్ జూనియర్ మెన్ క్యాంప్‌కు బాలాజిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఇద్దరు ఎంపిక పట్ల అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పీవి ప్రసాద్, బి. శివ ప్రసాద్ లు హర్షం వ్యక్తం చేస్తూ మరెన్నో ఉన్నతమైన శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు.

జిల్లాలో కరువు రక్కసి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లాలో కరవు రక్కసి కరాల నృత్యం చేస్తున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు చెప్పారు. జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం 79,115 హెక్టార్లుండగా.. కేవలం 17 వేల హెక్టార్లలో మాత్రమే రైతులు సాగు చేశారన్నారు. వర్షాలు లేక 7 వేల హెక్టార్లలో పంట ఎండి పోయిందన్నారు. మిగతా పంటలు కూడా ఎండి పోయేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పత్తి 5,722 హెక్టార్లలో, వరి 3,259 హెక్టార్లు, మొక్కజొన్న 849 హెక్టార్లు, కొర్ర 430 హెక్టార్లు, కంది 432 హెక్టార్లు, మినుము 3,247 హెక్టార్లు, వేరుశెనగ 2,344 హెక్టార్లు, ఆముదం 156 హెక్టార్లు, సోయాబీన్ 258 హెక్టార్లల్లో పంట ఎండిపోయిందని వివరించారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలను రైతులు దున్నేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పంట నష్టంపై సర్వే చేసి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

ప్రజాశక్తి - వేంపల్లె

భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు చల్లా బాలాజీ కోరారు. ఆదివారం కార్మిక సభ్యులతో కలిసి కడపలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు వారు స్పందించి వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

భూ వివాదం కారణంగా జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. తవళం గ్రామానికి చెందిన భార్యభర్తలు తలారి అన్నపూర్ణ, తలారి ఎల్లారెడ్డి ఆదే పంచాయతీలోని నల్లంవారిపల్లె వద్ద ఉన్న తమ భూమిని స్థానికులైన రమేష్‌బాబు ఆక్రమించుకున్నారని, మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారని చెప్పారు. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 2న నల్లంవారి పల్లెలోని భూమిని సర్వే చేస్తుండగా ఇరు గ్రూపుల మధ్య వివాదం చోటు చేసుకుందని తెలిపారు. ఈ ఘటనలో రమేష్ బాబు తన అనుచరులతో కలిసి కట్టెలతో తలారి అన్నపూర్ణ, ఎల్లారెడ్డిలపై దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడిలో గాయపడిన బాధితులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు పొందారని, 3న శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.